
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

సోమవారం 17 నవంబరు 2025

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మోమిన్‌పేట్	9.1
రంగారెడ్డి	శేరిలింగంపల్లి	10.0
మేడ్చల్	మూడుచింతలపల్లి	12.0





అసలే చలికాలం.. ఆపై విరిగిపోయిన కిటికీలు, తలుపులు.. నాణ్యతలేని దుప్పట్లతో ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు గజగజ వణికిపోతున్నారు. నాలుగు రోజులుగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. చాలీ చాలని దుప్పట్లు, స్నానానికి వేడి నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఇబ్బందులు తెలుసుకోవడానికి ఆదివారం 'ఆంధ్రజ్యోతి' వసతి గృహాలను విజిట్ చేసింది. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాల లేమి కొట్టొచ్చినట్టు కనబడింది.

వసతిలో

ఆంధ్రజ్యోతి విజిట్



కొందుర్గు: కిటికీలకు తలుపులు లేకపోవడంతో పరదాలు కట్టుకున్న విద్యార్థులు

వణుకు!

ఉమ్మడి జిల్లాలో చలికి గజగజలాడుతున్న విద్యార్థులు

99 సంక్షేమ హాస్టళ్లు..

రంగారెడ్డి జిల్లాలో 57 గురుకుల పాఠశాలలు, 99 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో బాల బాలికలు చదువుతున్నారు. వీటిలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 11 గురుకుల పాఠశాలలు, ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 14 గురుకుల పాఠశాలలు, గిరిజన సంక్షక్షేమ శాఖ ఆధ్వర్యంలో 16 గురుకుల పాఠవాలలు, మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9 గురుకుల పాఠశాలలు కొనసాగుతున్నాయి. మిగతావి ఆనంద నిలయాలు ఉన్నాయి. అత్యధికంగా ఎస్సీ సంక్షేమ శాఖ కింద 38 ప్రీ మెట్రిక్‌హాస్టళ్లు, 18 కళాశాలల హాస్టళ్లు ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలు 83 ఉన్నాయి, వీటిలో ప్రీ మెట్రిక్ హాస్టళ్లు 55 ప్రీ మెట్రిక్ హాస్టళ్లు ఉండగా, మిగతావి 28 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. జిల్లాలో 18 గురుకుల విద్యాలయాలు కొనసాగుతున్నాయి.

మంచాల మండల ఆరుట్ల ఎస్సీ హాస్టల్‌లో చలిమంట కాచుకుంటున్న విద్యార్థులు



తాండూరు బాలుర హాస్టల్‌లో కట్టెల పొయ్యిపై నీళ్లు వేడి చేసుకుంటున్న విద్యార్థులు

గదుల్లో విరిగిపోయిన కిటికీలు, తలుపులు

నాణ్యతలేని దుప్పట్లతో నిద్రా భంగం

స్నానానికి వేడి నీటి సౌకర్యం కరువు

ఎముకలు కొరికే చలిలో చన్నీళ్లే దిక్కు

ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యల తాండవం



నాగారంలోని బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల చన్నీటి స్నానాలు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా)

చలికి గజగజలాడుతున్నారు... దోమలు విజృంభిస్తున్నాయి.. సరైన దుప్పట్లు లేవు... సొన్నపు గదులు అరకొరే... చన్నీటి స్నానాలు.. వెరసి వసతి గృహాల్లో విద్యార్థుల అవస్థలు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వసతి గృహాల్లో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. సరిపడా దుప్పట్లు లేక, గదులకు కిటికీలకు, తలుపులు లేకపోవడంతో ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల విద్యారులు చలి తీవ్రతను తట్టుకోలేకపోతున్నారు. ఉదయం చలిలో చన్నీటి స్నానం చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు 376 మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది సరఫరా చేయాల్సిన దుప్పట్లు, ట్రంక్ బాక్స్‌లు, షూ, స్కూల్ యూనిఫాం అందజేయలేదు. గత ఏడాది పంపిణీ చేసిన ఒక దుప్పటితో సరిపెట్టుకుంటున్నారు. 2001లో నిర్మించిన డార్మెటరీలో కొన్ని కిటికీలు పాడైపోవడంతో రాత్రి వేళలో విద్యార్థులు చలికి వణుకుతున్నారు.

మంచాలలో మంచు దుప్పటే..

మంచాల మండలం ఆరుట్లలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో వంద మంది విద్యార్థులున్నారు. గదుల్లో విద్యార్థులకు సరిపడా బెడ్లు, దుప్పట్లు ఉన్నా చలికి తట్టుకోలేకపోతున్నారు. వసతి గృహంలో సోలార్ వాటర్ హీటర్ ఉన్నా అది పాడైపోయింది. దీంతో విద్యార్థులు

మిగతా 7వ పేజీలో...

మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల సమస్యల లోగిళ్లుగా మారాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్ లోని తెలంగాణ సాంఘిక సాంక్షేమ గురుకుల పాఠశాలలో గదుల కిటికీలకు తలుపులు లేక చలి తీవ్రతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శామీర్‌పేట్ మండలం తుర్కపల్లిలోని జూబ్లీహిల్స్ బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్లకు తులుపులు లేవు. కిచెన్‌లో విద్యార్థులే చపాతీలు చేస్తూ కనిపించారు. ఘట్‌కేసర్‌లోని మైసమ్మగుట్ట వద్ద గల ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు చన్నీటి స్నానాలే దిక్కయ్యాయి. విద్యార్థులకు ప్రభుత్వం దుప్పట్లు, చలికోట్లు(స్వెటర్లు) ఇప్పటికే పంపిణీ చేసింది. మేడ్చల్‌లోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో పాత దుప్పట్లనే వాడుకుంటున్నారు. ఇక్కడి విద్యార్థులకు చలికోట్లు పంపిణీ చేశారు.

చల్లని నీటితోనే స్నానం



చలికి ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన దుప్పటితో చలి ఆగడం లేదు. అసలే చలికి వణికిపోతున్నాం. స్నానం చేయడానికి వేడి నీటి సదుపాయం లేదు. స్నానం చేయాలంటేనే భయం వేస్తోంది. ఒక్కోసారి స్నానం చేయకుండానే పాఠశాలకు వెళ్తున్నాం. ఉన్నతాధికారులు స్పందించి వేడి నీటి సదుపాయం కల్పించాలి

- మోహన్, పదో తరగతి, ఎస్సీ బాలుర వసతి గృహం, పరిగి

ఇంటి నుంచి దుప్పటి తెచ్చుకున్న



హాస్టల్‌లో దుప్పటి ఇవ్వలేదు. ఇంటి నుంచే తెచ్చుకొని కప్పుకుంటున్నాం. డార్మెటరీకి కిటికీలు లేకపోవడంతో రాత్రి వేళ వచ్చే చల్ల గాలితో నిద్ర పట్టడం లేదు. గతేడాది ఒక దుప్పటి ఇచ్చారు. బెడ్‌షీట్ ఇవ్వలేదు. క్లాస్ రూమ్‌లకు ఉన్న కిటికీలకు అద్దాలు పగిలిపోయాయి. ఉదయం, రాత్రి వేళల్లో స్టడీ అవర్స్‌లో చలికి వణుకుతున్నాం. యూనిఫాం, స్పోర్ట్స్ డ్రెస్, షూస్ కూడా ఇంకా ఇవ్వలేదు.

- పి.రుత్విక్, 9వ తరగతి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఇబ్రహీంపట్నం



చేవెళ్లలోని బీసీ వసతి గృహంలో ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లను పరుచుకొని నిద్రిస్తున్న విద్యార్థులు

బుగ్గజాతరకు పోటెత్తిన భక్తులు



బుగ్గక్షేత్రం.. భక్తసంద్రం

దక్షిణకాశీగా పిలువబడే శ్రీ బుగ్గరామలింగేశ్వర క్షేత్రం ఆదివారం శివనామస్మరణతో మార్మోగింది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా బుగ్గజాతరకు తరలివచ్చి కార్తీక స్నానాలు ఆచరించారు. అనంతరం వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. వాహనాల రాకపోకలతో బుగ్గక్షేత్రానికి వెళ్లే దారులు రద్దీగా మారాయి. జాతరలో ఏర్పాటుచేసిన పార్కింగ్ స్థలం వాహనాలతో నిండిపోయింది. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పోలీసు యంత్రాంగం పలుచోట్ల సిబ్బందిని మోహరించి బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు వనభోజనాలు ఆచరించి స్వస్థలాలకు తిరిగి వెళ్లారు.

మంచాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి)

వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



పొలాల చెంత సిమెంట్ ప్లాంట్

దుమ్ము ధూళితో దెబ్బతింటున్న పంటలు.. నష్టపోతున్న రైతులు

8

వసతులతో డబుల్ ఇండ్ల పంపిణీ

» ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు వసతులు కల్పించి, లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మిషన్ భగీరథ నీటి సరఫరా పనులను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి వసతులు కల్పించడంలో విఫలమైందన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు కూడా చెల్లించ లేదని ఆరోపించారు. లబ్ధిదారుల ఎంపిక కూడ సక్రమంగా చేపట్టలేదని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు వసతులు కల్పించాలని మంజూరు చేసిన నిధులు పాత బకాయిలకు వెళ్లడంతో పంపిణీ ఆలస్యం జరుగుతుందని వివరించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలతో పాటు సీసీ రోడ్లను వేయించి నిజమైన లబ్ధిదారులకు ఇండ్లను కేటాయిస్తామని తెలిపారు. ఏమాత్రం పైరవీలకు అవకాశం ఇవ్వమని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీత, కాంగ్రెస్ పార్టీ నాయకులు అగ్గనూరి విశ్వం, చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరి బస్వం, కొంకళ్ళ చెన్నయ్య, ఎస్‌డీ ఇబ్రహీం, సి.రాజేందర్ రెడ్డి, నాగమణి, కొప్పునూరి ప్రవీణ్‌కుమార్, మురళీమోహన్, మాధవులు, ఎం.అశోక్ పాల్గొన్నారు.



మిషన్ భగీరథ నీటి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు జర్నలిస్టులు

» మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మంత్రి కోమటిరెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న జర్నలిస్టులు

శంకర్‌పల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏఐ యుగంలో మంచి చెడులను వివరించి మంచిని ప్రజలకు చేరవేయడంలో పూర్తి బాధ్యత మీడియాదేనని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నేషనల్ ప్రెస్ డే సందర్భంగా ఆదివారం ప్రొద్దటూర్ గ్రామ పరిధిలో ఉన్న ఎక్స్‌పీరియం ఎకో పార్కులో జర్నలిస్టు కుటుంబాల గెట్ టూ గెదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఎక్స్‌పీరియం ఎకో పార్కు నిర్వహిస్తున్న రాందేవ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎకో పార్కు కలియతిరిగారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు జర్నలిస్టులు అని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మొయినాబాద్ మండంలోని హిమాయత్‌నగర్ నుంచి చేవెళ్ల మండలం ఎన్కెపల్లి వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర రోడ్డును రూ.11 కోట్లతో నిర్మించనున్నట్లు హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ రోడ్డు నిర్మాణం గురించి ఇదివరకే మంత్రి జూపల్లి కృష్ణారావు తన దృష్టికి తీసుకువచ్చారని గుర్తు చేశారు. వారాంతాల్లో ఈ ప్రాంతానికి రద్దీ ఎక్కువ ఉంటుందన్నారు. టూరిజాన్ని పెంపొందించాలనే సీఎం సూచనల మేరకు రోడ్డు మంజూరు చేశామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ గాయని, అరుణోదయ విమలక్క, సింగర్ మంగ్లీ, నటుడు సాగర్, మంచు మనోజ్, నల్గొండ గద్దర్ ఆలపించిన పాటలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ జనరల్ సెక్రటరీ వరకుప్పల రమేష్, వైస్ ప్రెసిడెంట్ రాజేశ్, అరుణ, కోశాధికారి రమేశ్‌వైట్ల, జాయింట్ సెక్రెటరీలు హరిప్రసాద్, బాపురావు, ఈసీ సభ్యులు, పాలక వర్గం సభ్యులు, జర్నలిస్టు కుటుంబాలు ఉన్నారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం

» మంత్రి మహ్మద్ అజారుద్దీన్



మంత్రి అజారుద్దీన్‌ను గజమాలతో సన్మానిస్తున్న ఇఫ్తెకార్‌హైమద్

శంషాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని మంత్రి మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. మంత్రిగా బాధ్యతలు తీసుకొని మొట్టమొదటిసారిగా శంషాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నారై ఇఫ్తెకార్‌హైమద్ నాయకత్వంలో ఆదివారం శంషాబాద్ లోని ఇర్రంగార్డన్‌లో ఆయనను గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన 17ఏళ్ల రాజకీయ జీవితంలో సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతో మంత్రిగా ఒక అవకాశం వచ్చిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని తనకు చేతనైనంత వరకు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావుతో పాటు స్థానిక నాయకులు, శంషాబాద్ మాజీ సర్పంచ్ ఆర్.సిద్ధేశ్వర్‌తో కలిసి గజమాలతో సన్మానించారు.

అట్టహాసంగా గ్రాన్యూల్స్ గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్

» కన్హా శాంతివనంలో 2కె, 5కె, 10కె, 21కె రన్

» కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఇండియన్ క్రికెట్ ప్లేయర్ సయ్యద్ కిర్మాణి, నిర్మాత దిల్ రాజు, నటి మెహరీన్ పిర్జాదా



రన్‌ను ప్రారంభిస్తున్న సయ్యద్ కిర్మాణి, నిర్మాత దిల్ రాజు, నటి మెహరీన్ పిర్జాదా

నందిగామ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలపరిధిలోని కన్హాశాంతివనంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ స్పోర్ట్స్ అండ్ ఫిట్ ఇండియా సహకారంతో హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ గ్రాన్యూల్స్ ఇండియా ఆధ్వర్యంలో గ్రీన్ కన్హాలో భాగంగా 5కె, 10కె, 21కె రన్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని సుమారు 60 నగరాల నుంచి 5వేల మంది పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. గ్రీన్ రన్ పోటీలను మాజీ ఇండియన్ క్రికెట్ ప్లేయర్ సయ్యద్ కిర్మాణి, నిర్మాత దిల్ రాజు, నటి మెహరీన్ పిర్జాదా, రాంచంద్రమిషన్ ప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు. గ్రాన్యూల్స్ గ్రీన్ కన్హా రన్ ద్వారా వచ్చే డబ్బును చెట్ల పెంపకానికి ఉపయోగించడం అభినందనీయమని, యువతలో ప్రతిభను వెలికితీసేందుకు గ్రీన్ కన్హా రన్ ఎంతో ఉపయోగపడుతుందని మాజీ ఇండియన్ క్రికెట్ ప్లేయర్ సయ్యద్ కిర్మాణి ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రాన్యూల్స్ గ్రీన్ కన్హా రన్ ద్వారా వచ్చే ఆదాయంతో అడవుల్లో వేల చెట్లను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి అదనపు డీజీపీ మహేష్ భగవత్ మద్దతు తెలిపారు. గెలుపొందిన వారికి మాజీ ఇండియన్ క్రికెట్ ప్లేయర్ సయ్యద్ కిర్మాణి, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి మెడికల్ పార్టనర్‌గా మెడికవర్ హాస్పిటల్స్, టైమింగ్ పార్టనర్‌గా ఐక్యూ301, స్పోర్ట్స్ పార్ట్‌నర్‌గా డెకాథ్లాన్ ఉన్నారు. కార్యక్రమంలో గ్రాన్యూల్ ఇండియా లిమిటెడ్ డైరక్టర్ ఉమా చిగురుపాటి, రామచంద్రమిషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు



అడుగడుగునా గుంత వాహనదారుల చింత

- ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు
- నిత్యం ఎక్కడోచోట పడిపోతున్న బైక్ రైడర్లు



గుంతలమయంగా మారిన ఘనాపూర్ రోడ్డు

● అధ్వానంగా ఘనాపూర్ రోడ్డు



సీసీ పోసి పూడ్చిన గుంతలు

ఘట్‌కేసర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ-ఘనాపూర్ రోడ్డు పూర్తిగా పాడై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తా నుంచి ఘనాపూర్ వరకు రోడ్డు గుంతలమయమైంది. ఎన్టీపీసీ చౌరస్తా, ఆర్జీకే కాలనీ చౌరస్తా వరకు మున్సిపాలిటీ స్పెషల్ ఫండ్‌తో బీటీ రోడ్డు వేశారు. కానీ దివ్యాంగులు కాలనీ నుంచి పవర్ గ్రిడ్ వరకు రోడ్డు ఎక్కడికక్కడ గుంతలుగా మారింది. భారీ గుంతలయ్యాయని కొన్ని చోట్ల రాళ్లు, మట్టి వేశారు. కొన్నిచోట్ల సీసీతో పూడ్చారు. ఇలా రోడ్డంతా ఎగుడుదిగుడుగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు ఔటర్ సర్వీసు రోడ్లను కలిపేదవడంతో రద్దీ ఎక్కువ. కళాశాలలు, పాఠశాలలు, ఘనాపూర్, లింగాపూర్, పక్కీర్‌టెక్యా, లింగాపూర్, ఇందిరానగర్, బొక్కోనిగూడ గ్రామాల వారు ఈ రోడ్డు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డుకు ఏళ్లతరబడి మరమ్మతులు చేయక ఈ పరిస్థితి ఏర్పడింది. గుంతలను తప్పించబోయి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఆర్జీకే కాలనీ చౌరస్తా నుంచి ఘనాపూర్ సరిహద్దు వరకు రోడ్డు మరమ్మతులు చేయించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



గుంతలమయమైన అన్నోజిగూడ-ఘనాపూర్ రోడ్డుపై ప్రయాణానికి అవస్థలు పడుతున్నాం. చీకటిపడితే ఎక్కడి నుంచి ఏ వాహనం వస్తుందో తెలియడం లేదు. గుంతలను తప్పించబోయి బైక్ రైడర్లు పడిపోతున్నారు. రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువ. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలి.

- మండల కృష్ణ, ఘనాపూర్

రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది



ధ్వంసమైన అన్నోజిగూడ-ఘనాపూర్ రోడ్డులో ప్రమాదాలు నిత్య కృత్యం. భారీ గుంతలేర్పడ్డాయి, ఇబ్బందులు తట్టుకోలేక స్థానికులు డబ్బు పోగేసి సీసీ, రాళ్లు, మొరంతో కొన్నిచోట్ల పూడ్చారు. ఎగుడుదిగుడు రోడ్డుతో వాహనదారులు పడిపోతున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలి.

- వి.సంజీవగౌడ్, టీడీపీ అధ్యక్షుడు, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

రాజశేఖర్ హంతకులను శిక్షించాలి

షాద్‌నగర్‌లో కుల సంఘాల రాస్తారోకో



షాద్‌నగర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న కుల సంఘాల నాయకులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన ఎర్ర రాజశేఖర్‌ను హత్య చేసి, శవానికి నిప్పంటించిన హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ షాద్‌నగర్ ఆదివారం చౌరస్తాలో కుల సంఘాలు రాస్తారోకో చేశాయి. ఎల్లంపల్లికి చెందిన ఎర్ర చంద్రశేఖర్ అదే గ్రామానికి చెందిన కాగుల వెంకటేష్ కుమార్తెను ప్రేమ వివాహం చేసుకుంటే చంద్రశేఖర్ అన్న రాజశేఖర్‌ను కిడ్నాప్ చేసి హత్యచేయడమేమిటని ఎమ్మార్పీఎస్, డీఎస్పీ, టీ-ఎమ్మార్పీఎస్, కేవీపీఎస్, సీఐటీయూ, ఆల్ ఇండియా సమతాపార్టీ, బీఎస్పీ నాయకులు ఆందోళనకు దిగారు. రాజశేఖర్‌ను హత్య చేసిన దుండగులను అరెస్టు చేయాలని రోడ్డుపై బైఠాయించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహం చేసుకుంటే హత్య చేస్తారా? అని ప్రశ్నించారు. రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. రాజశేఖర్‌ను హత్యచేసిన వారిని శిక్షిస్తామని, అతడి తమ్ముడు చంద్రశేఖర్‌కు భద్రత కల్పిస్తామని ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. నిరసన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పెంటన్నోళ్ల నర్సింహ మాదిగ, ఎండీ వహీద్,టి.స్కైలాబ్‌బాబు, సంఘమేశ్వర్, సిద్ధార్థ రాజునాయక్, రవి, శ్రీను, బిక్షపతి, చెన్నయ్య, సింగపాగ జంగయ్య పాల్గొన్నారు.

కులోన్మాద హత్య దారుణం

షాద్‌నగర్ రూరల్: సాంకేతికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో కులోన్మాద హత్య జరగడం దారుణం అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్లంపల్లికి చెందిన రాజశేఖర్ తమ్ముడు చంద్రశేఖర్ ఇదే గ్రామానికి చెందిన కాగుల వెంకటేష్ కూతుర్ని ప్రేమ వివాహం చేసుకోగా పగ పెంచుకున్న అమ్మాయి తరుపు వారు రాజశేఖర్‌ను కిడ్నాప్ చేసి హత్య చేయడం అన్యాయం అన్నారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో పోలీసుల నిర్లక్ష్యంపైనా విచారణ చేయించాలన్నారు. అక్టోబరు 9న చంద్రశేఖర్, భవానీలు ఇంటి నుంచి వెళ్లిపోయి పెళ్లిచేసుకోలనుకుంటే షాబాద్ మండలం దైవాలగూడెంలో వారిని పట్టుకుని తీవ్రంగా కొట్టారని తెలిపారు. అమ్మాయిని హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంచారన్నారు. ఈ నెల 8న ప్రేమికులు తిరుపతి వెళ్లి పెళ్లి చేసుకున్నారని తెలిపారు. మేజర్లు అయిన చంద్రశేఖర్, భవానీ షాద్‌నగర్ పోలీసులను ఆశ్రయించగా ఓ ఎస్సై, ఓ ఏఎస్సై చంద్రశేఖర్, అతడి అన్న రాజశేఖర్‌ను బెదిరించారన్నారు. తమ ప్రాణాలకు ముప్పుందని తెలిసినా షాద్‌నగర్ పోలీసులు వారికి రక్షణ కల్పించలేదన్నారు. భవానీ బంధువైన ఓ పోలీసు అధికారే అందుకు సహకరించాడని ఆరోపించారు. దళిత యువకుడిని హత్య చేస్తే ఉన్నతాధికారులు వివరాలు సేకరించకపోవడం సరికాదన్నారు. దళిత సంఘాల నాయకులు హతుడి కుటుంబాన్ని పరామర్శించారు.



రాజశేఖర్ కుటుంబీకులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

అనంతగిరి ఘాట్‌లో లారీ బోల్తా

వికారాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ అనంతగిరి గుట్ట వద్ద తాండూరు వైపు గోల్డ్‌డ్రాప్ నూనె లోడుతో వెళుతున్న లారీ ప్రమాదానికి గురైంది. లారీ బ్రేక్ ఫెయిలై గుట్టను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీలోని నూనె డబ్బాలు, కార్టన్‌లు చెల్లాచెదురుగా పడ్డాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, నూనె వ్యాపారి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొందరూ నూనె ప్యాకెట్లు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసుల రాకతో ఊరుకున్నారు.



అనంతగిరి ఘాట్ రోడ్డులో బోల్తాపడిన నూనె ప్యాకెట్ల లారీ

మంత్రిని కలిసిన గుర్రం కేశవులు



మంత్రి శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కేశవులు

ఆమనగల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్థక, యువజన, క్రీడల శాఖల మంత్రి వాకాటి శ్రీహరిని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, ఆమనగల్లు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ సచివాలయలంలోని మంత్రి చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు మండలాలకు ప్రధాన కూడలి అయిన ఆమనగల్లు పట్టణంలో మినీ స్టేడియం నిర్మించాలని, అన్ని ప్రభుత్వ డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా మంత్రికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఇప్పటికే కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా హన్మంత్



ఆర్.కృష్ణయ్య నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న హన్మంత్

పరిగి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్‌గా పరిగి పట్టణానికి చెందిన కె.హన్మంత్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నగరంలో బీసీ సంఘాల చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా హన్మంత్ మాట్లాడుతూ, బీసీ డిమాండ్ల సాధన కోసం కృష్ణయ్య నాయకత్వంలో కలిసి పోరాటం చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

108 మంది దంపతులతో

సామూహిక యజ్ఞాలు



సామూహిక యజ్ఞంలో పూజలు చేస్తున్న దంపతులు

కొడంగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సేవా సమితి వార్షికోత్సవాలను ఆదివారం కొడంగల్‌లోని కేఎస్వీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. మళయాళ స్వామి ఆశ్రమ పీఠాధిపతులు, షాద్‌నగర్ దయానందగిరిస్వామిల ఆధ్వర్యంలో 108మంది దంపతులతో సామూహిక యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. చాలీసా పారాయణం, శ్రీ సూక్తం, పురుష సూక్తం, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం లక్ష్మీనారాయణ యజ్ఞం వేద మంత్రాలు పఠిస్తుండగా దంపతులు యజ్ఞం నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ.. నిర్మల మనస్సుతో భగవంతుడి స్మరించాలని, దైవ కార్యాల నిర్వాహణతోనే మానవ జన్మకు సార్థకత లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా దయానందగిరి స్వామిని కేఎస్వీ ఫంక్షన్ హాల్ యజమాని మురారి వశిష్టను సన్మానించారు.



మాట్లాడుతున్న దయానందగిరి స్వామి



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి-మాధవి దంపతులు

కల్వకుర్తి సుభిక్షం కోసం పూజలు

ఆమనగల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజవకర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆనందంగా జీవించాలని కాంక్షిస్తూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి-మాధవి దంపతులు ఆదివారం కార్తీక పూజలు నిర్వహించారు. ఆమనగల్లులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో కల్వకుర్తి, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ మండలాల కాంగ్రెస్ నాయకులు, కసిరెడ్డి కుటుంబీకులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నారాయణరెడ్డి దంపతులు కార్తీక పూజలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ప్రజల శ్రేయస్సును కాంక్షించి ఈ పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. సమాజ శాంతికి దైవకార్యాలు, యజ్ఞ యాగాలు, హోమాలు దోహదం చేస్తాయన్నారు. అలాగే ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కసిరెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు కసిరెడ్డి దుర్గాప్రసాద్‌రెడ్డి, కృష్ణవంశీధర్‌రెడ్డి, రామేశ్వరమ్మ, రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, దశరథరాంరెడ్డి, నారాయణరెడ్డి, యాట గీతనర్సింహ, భట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, భృంగి ఆనంద్‌కుమార్, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, శివలింగం, కల్లు రమణారెడ్డి, గుర్రం కేశవులు తదితరులు ఉన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

కడ్తాల్: ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రావిచెడ్‌లో రత్నమాల-రాములు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఆదివారం ఎమ్మెల్యే, నాయకులు యాట గీత, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహలతో కలిసి ప్రారంభించారు. రత్నమాల దంపతులకు పట్టువస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూజల్లో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పేదల గౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే అన్నారు. అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. లబ్ధిదారుల నుంచి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే నారాయణరెడ్డి హెచ్చరించారు. పీఏసీఎస్ డైరెక్టర్లు చేగూరి వెంకటేశ్, డాక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, బొప్పిడి రాఘవేందర్, యాదయ్య, జనార్ధన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష బిల్వార్చన

కులకచర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాంబండపై సోమవారం నిర్వహించే లక్ష బిల్వార్చన కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొంటారని ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసంలో చివరి సోమవారం సందర్భంగా జరిగే సామూహిక లక్ష బిల్వార్చన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని చెప్పారు. భక్తులు ప్లేట్, చెంబు, చెంచా వెంట తెచ్చుకోవాలని, పూజ సామగ్రి సమకూర్చుతామన్నారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు.

విలువలతో కూడిన జీవితాన్ని గడపాలి

» కృష్ణగిరి క్షేత్రం పీఠాధిపతి కృష్ణానందస్వామి

పరిగి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి విలువలు, నీతితో కూడిన జీవితాన్ని గడపాలని కృష్ణగిరి క్షేత్రం పీఠాధిపతి కృష్ణానందస్వామి అన్నారు. ఆదివారం బసిరెడ్డిపల్లిలోని కృష్ణగిరి క్షేత్రంలో కార్తీ మాసం సందర్భంగా భక్తులకు సత్సంగ ప్రవచనాలు చేశారు. క్యాన్సర్ రోగులకు మందులు అందజేశారు. అనంతరం మౌలాలి చాముండేశ్వరి ట్రస్టు సహకారంతో భక్తులకు,రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం స్వామీజీ మాట్లాడారు. తల్లిదండ్రులను మించిన దైవం లేదన్నారు. కన్నోళ్లను విస్మరించిన వారిని ప్రకృతే నాశనం చేస్తుందన్నారు. ప్రతి హిందువు సనాతన ధర్మాన్ని ఆచరించాలన్నారు. మనుషులందరినీ గౌరవించాలని, ప్రేమించాలని సనాతనం బోధిస్తోందన్నారు. విద్రోహ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు త్యాగరాజు, వెంకటేశ్, నర్సింహ పాల్గొన్నారు.



కృష్ణగిరి సత్సంగంలో మాట్లాడుతున్న కృష్ణానందస్వామి

వసతిలో వణుకు!

(ఐదో పేజీ తరువాయి)

చన్నీటితోనే స్నానం చేస్తున్నారు. ఉదయం హాస్టల్ ఆవరణలో చలిమంటలు కాచుకుంటున్నారు.

పర్యవేక్షణ కరువు

చేవెళ్ల, షాబాద్ మండలాల్లోని ఎస్సీ, బీసీ, వసతి గృహాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. చేవెళ్ల బీసీ వసతి గృహంలో 85 మంది విద్యార్థులు, షాబాద్ ఎస్సీ వసతి గృహలో 100 మంది, బీసీ హాస్టల్‌లో 95 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ వసతి గృహాల్లో వేడి నీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గదుల్లో కిటికీలు సరిగా లేకపోవడంతో తువ్వాళ్లు, దుప్పట్లు అడ్డంగా కట్టుకుని చలి నుంచి రక్షణ పొందుతున్నారు. చేవెళ్ల బీసీ వసతి గృహం విద్యార్థులకు దుపట్లు పంపిణీ చేయలేదు. దీంతో ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లను నేలపై పరుచుకుని నిద్రపోతున్నారు.

ఒంటరిగానే విద్యార్థులు

ప్రభుత్వ వసతి గృహాల్లో రాత్రి వేళల్లో నైట్ వాచ్‌మెన్లు లేకపోవడంతో విద్యార్థులు ఒంటరిగానే ఉంటున్నారు. దీంతో పర్యవేక్షణ కొరవడి విద్యార్థులు ఆరుబయటే తిరుగుతున్నారు. కొందరు విద్యార్థులు సెల్‌ఫోన్‌లు చూస్తున్నారు. వసతి గృహంలో విద్యార్థులను నియంత్రించే వారు లేకపోవడంతో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులపై పెత్తనం చేస్తున్నారని పలువురు విద్యార్థులు వాపోయారు.



షాబాద్ ఎస్సీ వసతి గృహంలో బాత్‌రూముల్లో చన్నీళ్లతో స్నానం చేస్తున్న విద్యార్థులు



చలికి తట్టుకోలేక ఎండకు మేడపై నిలుచున్న ఆమనగల్లులోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

దుర్భర స్థితిలో వసతి

షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వసతి గృహాలు దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన వసతి గృహాలకు కనీస మరమ్మతులు చేపట్టలేదు. కిటికీలకు రెక్కలు ఊడిపోవడం, తలుపులకు కన్నాలు పడటంతో విద్యార్థులు చలికి అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు సరిపడా దుప్పట్లు పంపిణీ చేయలేదు. వేడి నీటి సవతి లేక చల్లని నీటితో స్నానం చేస్తున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

బండలపై నిద్రిస్తున్న విద్యార్థులు

ఆమనగల్లు పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో 34 మంది విద్యార్థులు ఉండగా, ఆదివారం కేవలం తొమ్మిది మంది మాత్రమే ఉన్నారు. కొందరు వసతి గృహంలో పేరు నమోదు చేసుకొని స్థానికంగా ఉండడం లేదు. హాస్టల్‌లో మంచాలు ఉన్నా వినియోగించడం లేదు. బండలపై విద్యార్థులు నిద్రించాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. సోలార్ గీజర్ చాలా కాలంగా పనిచేయడం లేదు. దీంతో తప్పక చన్నీటితోనే స్నానాలు చేస్తున్నారు. ప్రభుత్వం అందజేసిన దుప్పట్లు చలిని తట్టుకునేలా లేకపోవడంతో ఇక్కట్లు తప్పడంలేదు. తాగునీటి శుద్ధి కేంద్రం కూడా పనిచేయడం లేదు. కొందరు చలికి తట్టుకోలేక ఇళ్ల నుంచి స్వెటర్లు తెచ్చుకొని వేసుకుంటున్నారు.

చన్నీటితోనే...

పరిగిలో ప్రభుత్వ బీసీ బాలుర, ఎస్సీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. బీసీ బాలుర వసతి గృహంలో 96 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ వసతిగృహం శిథిలావస్థకు చేరగా, కిటికీలు, తలుపులు సరిగా లేకపోవడంతో చలికి విద్యార్థులు వణికిపోతున్నారు. కిటికీలు మూయడానికి వీలు లేకపోవడంతో విద్యార్థులు కిటికీలకు, తలుపులకు రాళ్లు అడ్డంగా పెట్టుకుని నిద్రిస్తున్నారు. పరిగి ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యతలేని కార్పెట్లు, దుప్పట్లు పంపిణీ చేయడంతో విద్యార్థులు చలికి తట్టుకోలేకపోతున్నారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో పరుపులు పంపిణీ చేయకపోవడంతో తుప్పు పట్టిన మంచాలపైనే నిద్రిస్తున్నారు. స్నానం చేసేందుకు వేడి నీటి లేక ఒక్కో రోజు స్నానం చేయకుండానే విద్యార్థులు పాఠశాలలకు వెళ్తున్నారు.

ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లే..

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర, బీసీ బాలుర వసతి గృహాల విద్యారులకు పలుచని దుప్పట్లు పంపిణీ చేయడంతో విద్యార్థులు వాటిని పక్కన పెట్టి ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లను కప్పుకుంటున్నారు. ఎస్సీ వసతి గృహంలో 67 మంది విద్యార్థులకు 57 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఎస్సీ వసతి గృహంలో అక్కడక్కడ కిటికీలు విరిగిపోవడంతో చల్లని గాలులతో ఇబ్బంది పడుతున్నారు. ఎస్సీ వసతి గృహం విద్యార్థులకు చలికాలంలో పంపిణీ చేసే స్వెటర్లు ఇంకా అందజేయలేదు. ఈ విషయాన్ని వార్డెన్ దృష్టికి తీసుకురాగా వారంలో పంపిణీ చేస్తామని తెలిపారు. చలిని తట్టుకునేందుకు ఉదయం వేళ మంట కాపుకొంటున్న విద్యార్థులు స్నానాలకు ఆ మంటపైనే నీటిని కాచుకుంటున్నారు.



కొందుర్గు : శిథిలావస్థలో బీసీ బాలుర వసతి గృహం

ఆరు బయటే స్నానాలు

ధారూరు బీసీ వసతి గృహంలో 4 నుంచి పదో తరగతి వరకు మొత్తం 55 మంది విద్యార్థులు ఉన్నారు. శనివారం రాత్రి వసతి గృహంలో 30 మంది విద్యార్థులే ఉండగా, మిగతా వారు ఇళ్లకు వెళ్లిపోయారు. కాగా, వసతి గృహంలోని విద్యార్థులందరికి ఒక్కో దుప్పటి పంపిణీ చేశారు. చలిని తట్టుకునేందుకు కట్టెల పొయ్యిపై నీరు వేడి చేసుకుని ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. స్నానాల గదుల నుంచి నీరు బయటకు వెళ్లేందుకు పైపులైన్ లేకపోవటంతో వాటిని వినియోగించటం లేదు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో 77 మంది విద్యార్థులు ఉండగా కట్టెల పొయ్యిపై నీటిని వేడి చేసుకొని స్నానం చేస్తున్నారు.

గజగజలాడే చలిలో..

కొడంగల్ పట్టణంలోని బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వేడి నీటి సౌకర్యం లేక వణికించే చలిలో చన్నీటితో స్నానం చేస్తున్నారు. బొంరాస్‌పేట్ మండలం బొట్లవానితండా ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాల, దుద్యాల కేజీబీవీ విద్యార్థినులకు వేడి నీటి వసతి లేదు. విద్యార్థినులు నిద్రించే గదుల్లో కిటికీలు, తలుపులు లేక ఇటీవల మరమ్మతులు చేయించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలకు రిపేర్లు చేయించారు.

గోరు వెచ్చని నీటితోనే మమ అనిపించేస్తున్నారు

తాండూరులో చలి తీవ్రంగా ఉండడంతో బీసీ, ఎస్సీ బాలుర హాస్టళ్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ హాస్టల్ తాండూరు - హైదరాబాద్ రోడ్డు మార్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉంటుంది. విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కందనెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లాలి. సమయానికి పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఉదయం 8 గంటలకే బయలుదేరాల్సి వస్తోంది. దీంతో ఒక్కొక్కరుగా కట్టెల పొయ్యిపై నీటిని వేడి చేసుకొని స్నానం చేస్తున్నారు. ఎస్సీ హాస్టల్‌లో 60 మంది, బీసీ హాస్టల్‌లో 70 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్‌లో సోలార్ గీజర్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు ఈ ఏడాది స్వెటర్లు అందలేదు.



దుద్యాల్: చెట్టుపల్లి తండా కేజీబీవీ ఆశ్రమ పాఠశాలపై పనిచేయని సోలార్ వాటర్ హీటర్ ప్యానల్

వెంటనే దుప్పట్లు పంపిణీ చేయాలి



బీసీ వసతి గృహం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లతోనే సర్దుకుంటున్నాం. రాత్రి వేళలో చలి బాగా వేస్తోంది. దోమలు కూడా ఉన్నాయి. విద్యార్థులందరికీ దుప్పట్లు పంపిణీ చేయాలి. దోమల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలి.

- మహేష్, బీసీ వసతి గృహం విద్యార్థి, చేవెళ్ల

గంజాయి బ్యాచ్ ఆగడాలు

» డైట్ రోడ్డులో రోజూ రాత్రి హల్‌చల్
» విద్యార్థుల హాస్టళ్లు, డైట్ సమీపంలో అసాంఘిక చర్యలు
» కండోమ్ ప్యాకెట్లు, ఖాళీ మద్యం సీసాల పడవేత
» పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలంటున్న స్థానికులు





వాడి పడేసిన కండోమ్ ప్యాకెట్లు, ఖాళీ బీరు సీసాలు

వికారాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓ వైపు హాస్టళ్లు, మరోవైపు డైట్ కళాశాల.. మధ్యలో నడి రోడ్డుపై పదుల సంఖ్యలో కండోమ్ ప్యాకెట్లు.. ఖాళీ మద్యం సీసాలు.. ఇలా హాస్టళ్ల పక్కనే పాడుబడిన భవనంలో గంజాయి బ్యాచ్ చేస్తున్న ఆగడాలతో ఆ ప్రాంతంలో ఉండే విద్యార్థులు, స్థానికులు, వచ్చీపోయే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్ పట్టణంలో పోలీసుల పర్యవేక్షణ లేక చీకటి పడగానే గంజాయి బ్యాచ్ అసాంఘిక కార్యకలాపాలు, అకృత్యాలు పెచ్చుమీరుతున్నాయి. డైట్ కాలేజీ రోడ్డులో ఎస్సీ, బీసీ బాయ్స్ రెండు హాస్టళ్లు, డైట్ కళాశాల ఉన్నాయి. వీటి పక్కనే పాడుబడిన భవనం ఉంది. దానినే గంజాయి బ్యాచ్ అసాంఘిక పనులకు అడ్డాగా చేసుకుంది. మద్యం, గంజాయి తాగడం, వాడిన కండోమ్‌లను రోడ్లపై పడేయడం వంటి విశృంకులత్వానికి పాల్పడుతున్నారు. శనివారం రాత్రి రోడ్డుపై వెళ్లేవారికి పదుల సంఖ్యలో వాడేసిన కండోమ్ ప్యాకెట్లు కన్పించాయి. పాత భవనంలో గంజాయి బ్యాచ్ ఆగడాలనూ వారు గమనించారు. దీనిపై సిబ్బంది స్పందిస్తూ.. నిత్యం ఇదే తంతు కొనసాగుతోందని, పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, పోలీస్ పెట్రోల్ ఉంటే గంజాయి బ్యాచ్, తాగుబోతుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. ఈ తాగుబోతులు రాత్రంతా హాస్టళ్ల చుట్టే సంచరిస్తూ ఉంటారని వాపోయారు. వారు ఎప్పుడేహాని తలపెడతారోనని భయమేస్తోందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు డైట్ రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



బోనమ్మ తల్లిని దర్శించుకున్న మహేందర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాత తాండూరులోని బోనమ్మ జాతర సందర్భంగా ఆదివారం ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

బాల్యం నుంచే క్రమశిక్షణ నేర్పాలి

» ప్రభుత్వాలు అవినీతిని నివారించాలి
» సహస్రావధాని, ప్రవచనకర్త గరికపాటి నర్సింహారావు

కొడంగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యం నుంచే క్రమశిక్షణను అలవర్చి సన్మార్గంలో నడిచేలా చూడాలని ప్రవచనకర్త, సహస్రావధాని, పద్మశ్రీ అవార్డీ గరికపాటి నర్సింహారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాలులో ఆధ్యాత్మిక, ధార్మిక సేవా సమితి 28వ వార్షికోత్సవానికి హాజరైన నర్సింహారావు.. ప్రజలు, భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఇతరులు ఏది చేస్తే అదే చేయడాన్ని మానుకోవాలన్నారు. నీకు ఏది మంచో అదే ఆచరించాలని సూచించారు. పరిజ్ఞానంతో మసలుకోవాలన్నారు. ప్రతీ మనిషిలోనూ గుడి ఉందని, భగవంతుడిని దర్శించుకునేందుకని వెళ్తూ తొక్కిసలాటలు, ప్రమాదాలకు గురికావొద్దని చెప్పారు. ప్రభుత్వాల ఉచిత పథకాలు నిరుపేదలకు మాత్రమే అందాలన్నారు. అవినీతిని నివారిస్తే ఉచితాలు ఇవ్వకపోవడమే మంచిదన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉచితాలతో ప్రజలు, పాలకులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తనకు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ 45 రూపాయలు బ్యాంకులో జమ చేస్తే తిరిగి పంపించానని, సబ్సిడీకి గివ్ అప్ చేశానన్నారు. ఆధ్యాత్మికతతో ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. హిందువులు ఎన్నేరూపాల్లో భగవన్నామ స్మరణ చేస్తున్నారన్నారు. ఎలా చేసినా మంచే అని తెలిపారు. ప్రతీ వ్యక్తి మాట తప్పకుండా ధర్మబద్ధంగా నడుచుకుంటే సిరిసంపదలు పొందొచ్చని చెప్పారు. అత్తమామలు, తల్లిదండ్రులను గౌరవించాలని హితబోధ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



గరికపాటికి జ్ఞాపికను అందిస్తున్న ధార్మిక సేవా సమితి సభ్యులు



బిగ్‌బాష్ లీగ్ ఫైనల్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

తాండూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహిస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. తాండూరులో బిగ్‌బాష్ లీగ్ సీజన్-12 ఫైనల్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరు, హైదరాబాద్ టీమ్‌లు ఫైనల్‌కు చేరుకోవడం సంతోషకరం అన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, గెలిచిన వారు మరిన్ని విజయాల కోసం శ్రమించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడొద్దని, విద్యావంతులుగా, క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.50వేలు, రన్నర్స్‌కు రూ.30వేలు అందజేస్తారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ కరణం పురుషోత్తమరావు, డాక్టర్ సంపత్, నాయకులు అబ్దుల్ రవూఫ్, రఘు, అయూబ్‌ఖాన్, ఇంతియాజ్, అబ్దుల్ కవి, అంజాద్, మనీశ్, అఫ్జర్, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణం హర్షణీయం

చేవెళ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి సంస్థ ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. ఆదివారం చేవెళ్లలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను నూతనంగా నిర్మించేందుకు రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ప్రతినిధులు ముందుకొచ్చారు. ప్రజాప్రతినిధులు, సంస్థ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ రూ.కోటి పైగా నిధులతో పాఠశాల భవన నిర్మాణానికి ముందుకు రావడం ఆదర్శనీయం అన్నారు. పనులు తొందరలోనే ప్రారంభం అవుతాయన్నారు. సంస్థ ప్రతినిధులను అభినందిస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో పురందాస్, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, ప్యాక్స్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



పాఠశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే



పొలాల చెంత సిమెంట్ ప్లాంట్లు

- అనుమతి లేదంటున్న అధికారులు
- యథేచ్ఛగా సిమెంట్ మిక్సింగ్ ప్లాంట్ల నిర్వాహకుల దందా
- పంట పొలాలకు తీరని నష్టం



కొత్వాల్‌గూడలోని పంట పొలాల మధ్య ఏర్పాటు చేసిన సిమెంటు మిక్సింగ్ ప్లాంట్

శంషాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్‌గూడ, చెన్నమ్మ హోటల్ పరిధిలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పచ్చని వరి పొలాల చెంత కొందరు వ్యాపారులు సిమెంటు మిక్సింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఏర్పాటైన ప్లాంట్ల నుంచి రోజుకు కొన్ని రూ.కోట్లలో యథేచ్ఛగా దందా సాగుతున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే, ఈ మిక్సింగ్ దందా నార్సింగ్, కోకాపేట్ పరిసర ప్రాంతాల్లో కొనసాగేదని.. అధికారులు పర్యావరణం కాలుష్యమౌతోందని ఇక్కడికి తరలించినట్లు సమాచారం. కొన్ని నెలల క్రితం హిమాయత్‌సాగర్ సమీపంలోని కొత్వాల్‌గూడకు వెళ్లే రోడ్డు పక్కన సాగుచేస్తున్న వరి పంట పొలాల్లో మిక్సింగ్ ప్లాంట్లు పెద్దసంఖ్యలో వెలిశాయి. భారీ యంత్రాలతో పాటు కంకర, సిమెంటు కుప్పలు కుప్పలుగా పోయడంతో ఆ ప్రాంతంలో దుమ్ము, ధూళితో కాలుష్యం వెదజల్లుతోందని రైతులు వాపోతున్నారు. కాగా, హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జంట జలాశయాలు కాలుష్యం కాకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ ప్రాంతంలో జీవో 111ను జారీ చేసింది. చుట్టుపక్కల 108 గ్రామాల నుంచి కాలుష్యపు నీరు జంట జలాశయాల్లోకి చేరకుండా జీ-ప్లస్ వన్ కంటే ఎక్కువ ఎత్తులో ఇల్లు కట్టుకోవడానికి అనుమతి ఇవ్వకుండా నిబంధనలు పెట్టింది. కానీ, సిమెంట్ మిక్సింగ్ వ్యాపారులు మాత్రం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రోజుకు కొన్ని వందల లారీలలో సిమెంటు మిక్సింగ్ వ్యాపారం చేస్తున్నారు. ఈక్రమంలో కొత్వాల్ గూడ, హుడా కాలనీతో పాటు ఔటర్ రింగురోడ్డు పక్కన సర్వీసు రోడ్డుపై పెద్దఎత్తున గోతులు ఏర్పడుతున్నాయి. వాహనాలు నడపలేకపోతున్నామని స్థానికులు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ విషయమై ఎమ్మార్వో రవీందర్‌దత్‌ను వివరణ అడగ్గా.. సిమెంటు మిక్సింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతి లేదని, గతంలో కొన్నింటిని ఏర్పాటుచేశారని చెప్పారు. అనుమతిలేని ప్లాంట్లను తొలగిస్తామన్నారు.

ప్లాంట్లను తక్షణమే తొలగించాలి



పచ్చని పంటపొలాలను వదలకుండా బడా వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు మిక్సింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. చుట్టుపక్కల పంట పొలాలు దెబ్బతింటున్నాయి. సమీపంలోని హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయాలు కూడా కాలుష్యంతో నిండిపోతున్నాయి. ప్లాంట్లను తొలగించాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- వంశీ యాదవ్, శంషాబాద్



వెంకటేశ్‌కు నియామకపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శంకర్

అవినీతికి అవకాశమివ్వొద్దు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్య శాఖలో అవినీతికి అవకాశం లేకుండా అభివృద్ధికి బాటలు వేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. రంగారెడ్డి జిల్లా మత్స్య శాఖ పర్సన్ ఇన్‌చార్జిగా దోస వెంకటేశ్ నియమితుడయ్యారు. ఆదివారం ఎమ్మెల్యే శంకర్‌ను ఆయన మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్‌కు నియామకపత్రాన్ని ఇచ్చి అభినందించారు. మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చెరువుల్లో ఉచితంగా చేపలను వదులుతున్నదని గుర్తుచేశారు. చేపల పెంపకంతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని సూచించారు. మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని వెంకటేశ్‌కు ఎమ్మెల్యే శంకర్ సూచన చేశారు. నర్సప్పగూడకు చెందిన కావలి కృష్ణ, కోడిచర్ల యాదయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కేశంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చింతకుంటపల్లికి చెందిన బొల్లు మల్లమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. మాజీ జడ్పీటీసీ విశాలా శ్రవణ్‌రెడ్డి రూ.5వేలు నాయకుల ద్వారా అందజేసి కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు ఆలుగడ్డ మల్లేష్‌యాదవ్, జంగయ్య, హరికృష్ణ, యాదయ్య, మల్లేష్‌లు మృతిరాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- డెడ్‌బాడీని పరిశీలించిన అడిషనల్ డీసీపీ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏడీసీపీ సత్యనారాయణ, ఏసీపీ రాజు, సీఐ రవికుమార్

ఆదిభట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ నెంబర్ 12 సమీపంలోని సర్వీస్ రోడ్డు పక్కన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం సర్వీస్ రోడ్డు సమీపంలో దుర్వాసన రావడంతో స్థానికులు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మహేశ్వరం జోన్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ కేపీవీ రాజు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన చందు(40) అనే తాపీమేస్త్రీ ఆదిభట్ల సమీపం ఉంటూ పనులు చేస్తున్నాడని, మృతదేహం వద్ద కండువా, మృతిచెందిన వ్యక్తి జేబులో ఉన్న చిన్న బుక్‌లో నాలుగు ఫోన్‌నంబర్లు లభించడంతో ఫొటోలను ఆ నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించామన్నారు. మృతుదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 87126-62671 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ..

ఇబ్రహీంపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మంచాల మండలం లింగంపల్లి అనుబంధ గ్రామం మనోహరాబాద్‌కు చెందిన హనుమండ్ల పెంటయ్య(49) సెంట్రింగ్ కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇబ్రహీంపట్నం టౌన్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న ఆయన్ను బొలెరో వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఈశా హాస్పిటల్లో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా ఆసుపత్రి వైద్యుల నిరక్ష్యం కారణంగానే మృతిచెందాడంటూ బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. యాజమాన్యంతో బంధువులు సంప్రదింపులు జరపడంతో పరిస్థితి సద్దుమణిగింది. మృతుడు పెంటయ్యకు భార్య సాలమ్మ, కుమార్తె ఉంది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందర్‌సింగ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



అబ్దుల్ హనీఫ్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని టోలిచౌకికి చెందిన చెందిన అబ్దుల్ హనీఫ్‌కు మూడేళ్ల క్రితం శంషాబాద్ మండలంలోని తొండుపల్లికి చెందిన షబానాబేగంతో వివాహం జరిగింది. వీరికి ఓ కుమార్తె ఉంది. అయితే, వివాహం జరిగిన కొన్నిరోజుల వరకు భార్యాభర్తలిద్దరూ బాగానే ఉన్నారు. కొన్ని రోజులుగా వారిమధ్య గొడవలు తలెత్తుతున్నాయి. గత 5 నెలలుగా తొండుపల్లిలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 10న హనీఫ్.. తన తండ్రి అబ్దుల్ హమీద్‌కు వాట్సాప్ ద్వారా వాయిస్ రికార్డు పంపించాడు. అందులో వారు తరచూ గొడవ పడుతున్నట్లు ఉంది. వాయిస్ రికార్డు విన్న తండ్రి హమీద్ కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఫలితం లేకపోయింది. శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తల్లారంలో ఇంటిని ప్రారంభించిన అనంతరం లబ్ధిదారుతో ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, నంబరు 16(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం చేవెళ్ల మండలంలోని తల్లారం గ్రామానికి చెందిన బొర్ర స్వాతి-బందయ్య నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును ఎమ్మెల్యే లబ్ధిదారులు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు అందించి చేయూతనిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకటరెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, డైరెక్టర్ పాండుయాదవ్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, సీనియర్ నాయకులు మాణిక్యం, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్.. పేదలకు వరం : కేఎల్లార్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిగా బాధ్యతలు తీసుకున్న మరుసటి రోజు నుంచే మహేశ్వరం నియోజకవర్గంలో వేలాది మంది పేదలకు చెక్కులు పంపిణీ చేసినట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. ఆదివారం తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్వరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రోగుల శస్త్ర చికిత్సలు, ఇతర వైద్యసేవలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో ఖర్చు చేస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల కార్పొరేట్ వైద్యం అందిస్తూనే అందని వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకుంటుందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు సన్నబియ్యంతో కడుపు నింపుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదలను గాలికొదిలేశారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన హామీలన్నీ అమలు పరుస్తూ ప్రజలకు మరింత చేరువవుతున్న కాంగ్రెస్‌ను చూసి కడుపుమంటతో బీఆర్‌ఎస్, బీజేపీల నాయకులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని ఆరోపనలు చేసినా స్థానిక ఎన్నికల్లో కూడా జూబ్లీహిల్స్ మాదిరిగానే గ్రామాల్లో ఫలితాలు ఉంటాయన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, మహేశ్వరం మండల మాజీ వైస్ ఎంపీపీ సునితాఅంద్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్సై ఉద్యోగాలు పొందిన వారిని సత్కరిస్తున్న ఉప్పల వెంకటేశ్ తదితరులు

విద్యతోనే ఉన్నత జీవితం

తలకొండపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత జీవితం, సమాజంలో గౌరవం లభిస్తుందని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. విద్యాధికులు అధికంగా ఉన్న ప్రాంతాలు వేగవంతంగా అభివృద్ధి సాధిస్తాయని ఆయన అన్నారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరంలో శిక్షణ పొంది ఎస్సై ఉద్యోగాలు సాధించిన సతీష్‌రెడ్డి, హేమలతలు ఆదివారం ఉప్పల వెంకటేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని వెంకటేశ్ శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నందు అకాడమీ చైర్మన్ నందు, మాజీ జడ్పీటీసీ నర్సింహ, నాయకులు, ట్రస్ట్ సభ్యులు బుచ్చిబాబు, నరేందర్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు శ్రీనివాస్‌రెడ్డి ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు కూతురు వివాహ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్‌ఎస్ జిల్లా, మండల నాయకులు అనిల్‌కుమార్, పవన్‌కుమార్, జ్యోతయ్య, నాగులు నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, సుభాశ్, వీరేశం, సుధాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదులు పత్రికలు

తలకొండపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజాచైతన్య, సమస్యలను వెలికితీసి పరిష్కారం మార్గాలను చూపడంలో పత్రికల పాత్ర కీలకమని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అని అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో బుధవారం జాతీయ పత్రికా దినోత్సవం సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్‌తో కలిసి తలకొండపల్లి మండలం పాత్రికేయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పాత్రికేయుల సంఘం నాయకులు దరువుల శంకర్, చంద్రకుమార్, విష్ణు, వెంకటరెడ్డి, శ్రీను, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, నాయకులు లింగం, వెంకటయ్య, తదితరులున్నారు.



పాత్రికేయులను సన్మానిస్తున్న సీఎల్ శ్రీనివాస్ యాదవ్

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గురుస్వాములు

చేవెళ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయం 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం మహా పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పీజీ మురళి నంబూద్రి, గురుస్వామి ఎం.ఎం. కృష్ణన్ గురుస్వామి, కిరణ్ మహేందర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు కిరణ్‌కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. గణపతి, కుమార స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపి అయ్యప్పస్వామి విగ్రహానికి పంచామృత అభిషేకం, కుంకుమ, చందనం, పసుపు, భస్మాభిషేకాలు నిర్వహించి అయ్యప్పను కొలిచారు. గాయకుడు ఈలపాటి శ్రీనివాస్ భజనబృందం భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. అయ్యప్ప శరణుఘోషతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సన్నిధానం స్వాములు, మండలంలోని వివిధ గ్రామాల అయ్యప్ప మాలధారణ స్వాములు, గ్రామపెద్దలు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణ చొరవతో కేశంపేటకు 13 హైమాస్ట్ లైట్లు

కేశంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కృషితో కేశంపేట మండలానికి 13 హైమాస్ట్ లైట్లు మంజూరయ్యాయని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ఎం.శివాజీ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 13 గ్రామాలకు 13 హైమాస్ట్ లైట్లను డీకే అరుణ మంజూరు చేశారని, ఇందుకుగాను రూ.32లక్షల50వేలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాలలో లైట్లు బిగించారని, రెండు రోజులలో కేశంపేటలో బిగిస్తారని పేర్కొన్నారు. డీకే అరుణకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు కల్పించాలి

షాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. షాబాద్‌లో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష ఆదివారం 36వ రోజుకు చేరింది. షాబాద్ మండల మిషన్ భగీరథ ఉద్యోగులు విజయ్, వర్ధన్, సునీల్, ప్రభాకర్, మధు, సుమంత్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించి, ఉద్యోగ, ఉపాధి, రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రవీందర్, రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, రమేష్‌యాదవ్, నర్సింహులు, రాము, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు పాటుపడాలి



బహుమతులు అందిస్తున్న వెంకటేశ్

ఆమనగల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సమాజ సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందుండాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ పిలుపునిచ్చారు. దాతృత్వం, సేవాభావం వ్యక్తి ప్రతిష్ఠకు దోహద పడుతాయన్నారు. ఆమనగల్లు మండలం అయ్యసాగర్ త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి ఆలయంలో మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరభద్రస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం విద్య, వైద్యపరంగా పేదలను ఆదుకోవడంలో ముందుందన్నారు. ఆర్యవైశ్య సంఘం మల్కాజిగిరి అధ్యక్షుడు పాత శ్రీనివాస్‌గుప్తా, కార్యదర్శి సురేశ్, నాయకులు డీవైఎస్ గుప్తా, ఆనంద్, జ్ఞానేశ్వర్, మహిళా సంఘం అధ్యక్షురాలు గీతా రాణి, కార్యదర్శి శారద, ట్రెజరర్ ఉమామహేశ్వరి, సభ్యులు నిర్మల, స్రవంతి, తదితరులు ఉన్నారు.



పుస్తె, మెట్టెలు వితరణ

మొయినాబాద్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీని కొనసాగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు ఓ మాజీ ఎంపీటీసీ సభ్యుడు. మొయినాబాద్ మండలం రెడ్డిపల్లికి చెందిన మోర శ్రీనివాస్ గత ఎన్నికల ప్రచారంలో తనను గెలిపిస్తే గ్రామానికి చెందిన ఆడపడుచుల పెళ్లికి పుస్తె, మెట్టెలను కీ.శే మోర శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు గ్రామానికి చెందిన జంగయ్య, పద్మ దంపతుల కుమార్తె నందిని వివాహం ఆదివారం జరిగింది. మోర శ్రీనివాస్ పెళ్లింటి వారిని ఇంటికి పిలిపించి పుస్తె, మెట్టెలను అందజేశారు. కార్యక్రమంలో మోర వెంకటేష్‌తో పాటు కుటుంబ సభ్యులు ఉన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

ఇబ్రహీంపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు జయంతి సందర్భంగా మండల పరిధిలోని నాగన్‌పల్లిలో ఆదివారం గ్రామస్తులు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రామోజీ ఫౌండేషన్ నాగన్‌పల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని పాఠశాల భవనాన్ని నిర్మాణం చేసింది. అంతేగాకుండా గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లు, తాగునీటి శుద్ధి కేంద్రం, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతోపాటు పచ్చదనం పెంపునకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు విరివిగా మొక్కలు నాటారు. గ్రామం నడిబొడ్డున రామోజీరావు విగ్రహం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పూజలో మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి నాయకులు

కొత్తూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత నెలకొంటుందని స్థానిక మాజీ ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్లాపూర్‌తండా గ్రామపంచాయతీ పరిధి రాగ్యాతండాలోని లలితాంబికా దేవి ఆలయంలో నిర్వహించిన రెండో వార్షికోత్సవం సందర్భంగా మాజీ ఎంపీపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాజీ సర్పంచులు రవినాయక్, కాట్న రాజు, మాజీ ఎంపీటీసీ మోది దర్శన్, మాజీ ఉపసర్పంచ్ దశరథ్‌నాయక్, నాయకులు రాములుగౌడ్, బోకుల రాజు, లక్ష్మణ్‌నాయక్, రవినాయక్, రాజుగౌడ్, పాండు తదితరులున్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పానుగంటి పర్వతాలు



సమావేశంలో మాట్లాడుతున్న పర్వతాలు

మహేశ్వరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గత వంద సంవత్సరాల నుంచి పేదలు, బడుగు, బలహీన వర్గాలతో పాటు కార్మిక, కర్షక లోకానికి సీపీఐ వెన్నంటి ఉందని, డిసెంబరు 26న ఖమ్మంలో నిర్వహించే సీపీఐ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పానుగంటి పర్వతాలు అన్నారు. ఆదివారం మహేశ్వరం మండల కేంద్రంలో పార్టీ కౌన్సిల్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ ప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు పేదలు, కార్మికుల పక్షాన ఉన్నది ఒక్క సీపీఐ మాత్రమేనన్నారు. అంతేకాకుండా త్యాగాలు, భూ పోరాటాలు, ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర ఉన్న సీపీఐ ఒక్కటేనన్నారు. డిసెంబరు 26న ఖమ్మంలో లక్షలాది మందితో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీపీఐ మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ బి.దత్తునాయక్, పల్నాటి యాదయ్య, దేవేందర్‌గౌడ్, రాజు, యాదగిరి, సాయి, రామచంద్రయ్య, రాములు, రమేష్, జోసెఫ్, సురేశ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట

కేశంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని మాజీ ఉపసర్పంచ్ నీల లావణ్య పాండు అన్నారు. మండల పరిధిలోని బొదునంపల్లి గ్రామానికి నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.4లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి మంజూరయ్యాయి. ఆదివారం గ్రామస్తులతో కలిసి మాజీ ఉప సర్పంచ్ పనులను ప్రారంభించారు. గ్రామానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే శంకర్, పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పిప్పళ్ల శేఖర్, హరేందర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

ఆమనగల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంధ్య క్లినిక్ వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. డాక్టర్ రామ్‌నర్సింహ దేవ్, సాయిపవన్ నాయక్‌లు 121మందికి రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులందజేశారు. ఆరోగ్య సంరక్షణ, ఆహార నియమాలు, వ్యాయామం ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.